జ్ఞానేశ్వర్‌గౌడ్‌కు దత్తాత్రేయ పరామర్శ



మాజీ కార్పొరేటర్ జ్ఞానేశ్వర్‌గౌడ్‌ను పరామర్శిస్తున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

రాంనగర్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : అంబర్‌పేట నియోజకవర్గంలోని బాగ్‌అంబర్‌పేట డివిజన్ మాజీ కార్పొరేటర్ పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్ అనారోగ్యానికి గురై ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న నేపథ్యంలో సోమవారం మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్‌గౌడ్ ఆరోగ్య పరిస్థితిని దత్తాత్రేయ అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జ్ఞానేశ్వర్‌గౌడ్ కుమారుడు వెంకట్‌గౌడ్, వివిధ పార్టీల నాయకులు కె.దుర్గాప్రసాద్‌రెడ్డి, చింతల శ్రీనివాస్‌ముదిరాజ్, గడ్డం లక్ష్మణ్‌గౌడ్, కోటం అనిల్‌కుమార్, గడ్డం శ్రీధర్‌గౌడ్, బి.మల్లికార్జున్‌గౌడ్, రావుల సుధాకర్, దడిగె జగన్‌యాదవ్, సద్గురు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయం

ముషీరాబాద్, అక్టోబర్ 6(ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్ అన్నారు. సోమవారం బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ కమిటీ ఉపాధ్యక్షుడు జి.రాజు, ఎడ్ల హరిబాబుయాదవ్‌ను కలిసి పార్టీ కార్యక్రమాలు, ప్రజాసమస్యల పరిష్కారంపై మాట్లాడారు. ఈ సందర్భంగా హరిబాబుయాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో లేకున్నా ప్రజలు కేసీఆర్ వెంటే ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ ముషీరాబాద్ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సదా, సీనియర్ నాయకులు ఎయిర్‌టెల్ రాజు పాల్గొన్నారు.

పేరుకుపోయిన చెత్తకుప్పలను తరలించాలి



బాగ్‌అంబర్‌పేటలో సమస్యలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తదితరులు

రాంనగర్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : బాగ్ అంబర్‌పేటలో పేరుకుపోయిన చెత్తకుప్పలను వెంటనే తరలించాలని జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బందికి స్థానిక కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి సూచించారు. సోమవారం డివిజన్‌లోని రెడ్‌బిల్డింగ్ చౌరస్తా, ఎస్‌బీఐకాలనీ, డీడీకాలనీ తదితర ప్రాంతాల్లో ఆమె పాదయాత్ర చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా చెత్త, చెదారం తొలగించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లను ఆధునికీకరించాలి : సుప్రియానవీన్‌గౌడ్



జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్

ముషీరాబాద్, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో అధ్వానస్థితికి చేరుకున్న రోడ్ల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయా రోడ్లను ఆధునీకరించాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం కమిషనర్‌ను కలిసిన సుప్రియానవీన్‌గౌడ్ మాట్లాడుతూ ముషీరాబాద్ డివిజన్‌లోని గంగపుత్రకాలనీ, బాపూజీనగర్, సద్గురుటెంట్‌హౌస్ వీధి, అరుణ్ కోఆపరేటివ్ సొసైటీ వీధి, పటాన్‌బస్తీ, ఫ్రెండ్స్‌కాలనీలోని రోడ్లను ఆధునీకరించాలని కోరారు. పార్శిగుట్ట వద్ద గల గౌడ కులస్థుల శ్మశానవాటికలో మరుగుదొడ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. చాలా రోజులుగా ఆయా ప్రాంతాల్లోని ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

భోలక్‌పూర్ ప్రజల సమస్యలు పరిష్కరించాలి



ప్రజావాణిలో వినతిపత్రం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్

ముషీరాబాద్ : భోలక్‌పూర్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణిలో స్థానిక డివిజన్ మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. సోమవారం జరిగిన ప్రజావాణిలో వాజీద్ హుస్సేన్ వినతిపత్రం అందజేసి మాట్లాడుతూ భోలక్‌పూర్‌లోని శేఖర్‌రెడ్డి వీధి వెనకభాగంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను, దేవీచౌక్ వద్ద అధ్వానంగా మారిన రోడ్లను వెంటనే ఆధునికీకరించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గాంధీనగర్‌లోని సబర్మతినగర్‌లో వెంటనే కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అభిషేక్ కెనడీ తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌నగర్‌లో నిరుద్యోగ అభ్యర్థుల నిరసన



నిరసన తెలియజేస్తున్న నిరుద్యోగులు

చిక్కడపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందేందుకు కాంగ్రెస్ పార్టీ కుట్రలు పన్నుతోందని నిరుద్యోగ అభ్యర్థులు ఆరోపించారు. గ్రూప్-1 అభ్యర్థులకు న్యాయం జరిగేవరకు తమ పోరాటం ఆగదన్నారు. సోమవారం అశోక్‌నగర్‌లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు జనార్దన్, ఇంద్రానాయక్, సుధాకర్, నరసింహులు మాట్లాడుతూ తప్పుడు నియామకాలతో నిరుద్యోగులు అన్యాయానికి గురవుతున్నారన్నారు. ప్రభుత్వం హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో అధిక ఖర్చుచేసి న్యాయవాదులను పెట్టి వాదిస్తున్నారని, తమకు అంత స్థోమత లేదన్నారు. గ్రూప్-1 కేసుపై ప్రతిపక్షాలు ముందుకు వచ్చి కోర్టుల్లో వాదించేలా తమకు న్యాయమందించాలన్నారు. ప్రభుత్వం దొడ్డిదారిన అర్ధరాత్రి గ్రూప్-1 ఫలితాలను ప్రకటించడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.

ఇంటర్, డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న వల్లభనేని ప్రసాద్, కె.వెంకటేష్‌గౌడ్

రాంనగర్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : నగరంలోని మలక్‌పేటలో గల ప్రభుత్వ బధిరుల పాఠశాల ఆవరణలో ఇంటర్, డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని, హాస్టల్ వసతి కల్పించాలని, ప్రతి జిల్లాలో సైగల భాష ద్వారా ప్రత్యేక మూగ, బధిరుల పాఠశాల, అందులో హాస్టల్ వసతి కల్పించాలని కోరుతూ డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, దివ్యాంగుల సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.వెంకటేష్‌గౌడ్‌లు చీఫ్ సెక్రటరీకి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలక్‌పేట పాఠశాల ప్రాంగణంలో ఖాళీగా ఉన్న రెండవ అంతస్తు భవనంలోకి పాఠశాలను మార్చాలని, పాఠశాలకు అనుబంధంగా ఉన్న హాస్టల్ వసతి కల్పించి విద్యార్థులకు తగు రక్షణ కల్పించాలన్నారు. కమ్యూనిటీహాల్ ఏర్పాటు చేయాలని వారు కోరారు.

మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు : సీఐ



బస్సును సీజ్ చేస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకటలక్ష్మి

కవాడిగూడ : మద్యం సేవించి వాహనం నడిపితే చర్యలు తప్పవని గాంధీనగర్ ట్రాఫిక్ సీఐ వెంకటలక్ష్మి హెచ్చరించారు. సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ టెస్టులో పట్టుబడ్డ పలు డ్రైవర్లపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ట్రాఫిక్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విస్తృతంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించని వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. 30మంది ప్రయాణికులతో మద్యం తాగి ప్రైవేట్ ట్రావెల్స్‌కి చెందిన బస్సు నడుపుతున్న డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా చర్యలు

చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు

ఇంటర్వ్యూ



చిక్కడపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు, రద్దీ ఏర్పడకుండా అన్ని చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు వీరేశం వివరించారు. బోనాలు, దసరా, హోళీ, దీపావళి, రంజాన్, క్రిస్మస్ వంటి పండుగ రోజుల్లో కూడా తమ పీఎస్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటామని వివరించారు. ముఖ్యంగా పోటీపరీక్షల అభ్యర్థులు వేల సంఖ్యలో ఇక్కడ కోచింగ్ సెంటర్లలో కోచింగ్ తీసుకోవడం, స్టడీహాళ్లలో చదువుకోవడం, చిక్కడపల్లి హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయం ఆవరణలోనే నిత్యం రెండువేల మంది పోటీపరీక్షలకు చదువుకోవడానికి రావడం, ఉద్యోగ నోటిఫికేషన్‌లు ప్రకటించాలని, డిమాండ్ చేస్తూ అభ్యర్థులు ఉద్యమాలకు దిగుతూ రాస్తారోకోలు చేయడం, వారికి మద్దతుగా నేతలు రావడం వంటి క్లిష్ట సమయాల్లో కూడా ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా ఉన్న సిబ్బందితోనే చర్యలు తీసుకుంటామని ఇటీవలనే తాను ఈ పీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా చార్జి తీసుకున్నందున అన్ని విషయాలు కూలంకషంగా పరిశీలించి ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఏడుకొండలుతో ప్రత్యేక ఇంటర్వ్యూ..

ప్రశ్న: చిక్కడపల్లి ట్రాఫిక్ పీఎస్ పరిధిలో ఎన్ని ట్రాఫిక్ సమస్యాత్మక ప్రాంతాలున్నాయి?

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్: పీఎస్ పరిధిలో ఆర్టీసీ క్రాస్‌రోడ్, బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం, ముషీరాబాద్‌చౌరస్తా, రాంనగర్‌చౌరస్తా వంటి ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడే సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించాం. ట్రాఫిక్ సమస్య రాకుండా ఎప్పటికప్పుడు అనేక చర్యలు తీసుకుని అమలు చేస్తాం. పీఎస్ పరిధిలో తరచుగా వీఐపీ మూవ్‌మెంట్ ఉంటున్నందున ఉన్న సిబ్బందితోనే ఇబ్బందులు రాకుండా చర్యలు చేపడుతాం.

ప్రశ్న: ఈ మధ్యకాలంలో పోటీపరీక్షల అభ్యర్థులు తరచుగా నోటిఫికేషన్‌లు వేయాలని ఉద్యమాలు చేస్తూ ఆందోళనలు, రాస్తారోకోలు చేస్తున్న క్రమంలో ఇబ్బందులు రాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్: నిరుద్యోగ అభ్యర్థులు రోడ్డుపైనే ఉద్యమించినా కూడా కొద్దిసేపే ఆందోళన చేసి అక్కడనుంచి వైదొలిగేలా చర్యలు తీసుకుంటాం. లోయర్‌ట్యాంక్‌బండ్ కట్టమైసమ్మ ఆలయం నుంచి వీఎస్టీ వరకు స్టీల్ బ్రిడ్జి నిర్మాణం జరిగి ఉపయోగంలో ఉన్నందున ప్రధానంగా ట్రాఫిక్ ఇబ్బందులు పెద్దఎత్తున తప్పిపోయాయనే చెప్పవచ్చు.

ప్రశ్న: పండుగలు, ఉత్సవాల సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు అధిగమించేందుకు చర్యలు ఎలా ఉన్నాయి?

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్: ప్రతినిత్యం ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో కానిస్టేబుల్, హోమ్‌గార్డ్‌లు అక్కడ ఉండి ట్రాఫిక్‌ను సాఫీగా వెళ్లేవిధంగా కృషిచేస్తున్నాం. పండుగలు, ఉత్సవాల రోజుల్లో ప్రధాన ప్రాంతాల్లో ఎక్కువ సిబ్బందిని ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్యను వెంటవెంటనే పరిష్కరిస్తున్నాం.

ప్రశ్న: పీఎస్ పరిధిలో అంబులెన్స్‌లు సాఫీగా వెళ్లడానికి ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా?

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్: ప్రధాన చౌరస్తాల్లో అంబులెన్స్‌లు వచ్చిన సమయంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటే అవి సాఫీగా వెళ్లిపోయే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. అంబులెన్స్ వెళ్లిపోయాక మళ్లీ యథావిధిగా ట్రాఫిక్ రాకపోకలు కొనసాగేలా చూస్తున్నాం.

ప్రశ్న: ఆర్టీసీ క్రాస్‌రోడ్ అంటేనే సినిమాలు, బిర్యానీ హోటళ్లకు కేంద్రంగా చెబుతారు. స్టార్‌హీరోల కొత్త సినిమాలు విడుదల సందర్భంలో ట్రాఫిక్ చిక్కులు ఎర్పడుతున్నాయా?

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్: స్టార్‌హీరోల కొత్త సినిమాలు విడుదల సందర్భంలో క్రాస్‌రోడ్‌లో ట్రాఫిక్ చిక్కులు ఏర్పడుతున్నట్లు తెలిసింది. అభిమానులు థియేటర్ల వద్ద బాణసంచా కాల్చడం, స్వీట్లు తినిపించడం, అభిమానులు పెద్దఎత్తున గుమిగూడడంతో పాటు పలు సంఘాలు, పార్టీలు క్రాస్‌రోడ్‌లో ఉద్యమాలు నిర్వహించిన సమయాల్లో సమస్య ఏర్పడుతోంది. ఈ సమయాల్లో లా అండ్ ఆర్డర్ పోలీసుల సహకారంతో సమస్య జటిలం కాకుండా చూస్తాం.

ప్రశ్న: పీఎస్‌కు సరిపోయినంత సిబ్బంది ఉన్నారా?

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్: పీఎస్‌కు సరిపోయేంత సిబ్బంది లేకపోయినా ఉన్నవారితోనే ఇబ్బందులు రాకుండా చర్యలు చేపడుతున్నాం.



నూతన డీజీపీగా నియమితులైన బి. శివధర్‌రెడ్డిని సోమవారం కలిసి శాలువా పూలబొకేతో సత్కరిస్తున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగుల్ల రాజిరెడ్డి. ఈ సందర్భంగా డీజీపీకి దసరా, దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

అలరించిన సినీ సంగీత విభావరి

చిక్కడపల్లి, అక్టోబరు 6 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక వేదిక రామ్‌కుమార్ కళారవిందం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో బాలు పాటకు బ్రహ్మరథం శీర్షికతో నిర్వహించిన సినీసంగీత విభావరి అలరించింది. గాయనీగాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న గీతాలను వీనులవిందుగా ఆలపించారు. అనంతరం జరిగిన సమావేశానికి వంశీ రామరాజు ముఖ్యఅతిథిగా హాజరై గాయనీగాయకులను సన్మానించారు. రామ్‌కుమార్‌కు ప్రముఖ గాయకుడు బాలసుబ్రహ్మణ్యం ప్రతిమను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో గాయనీగాయకులు భార్గవి, రవిశంకర్, నాగేందర్ పాల్గొన్నారు.

జైకిసాన్ రూపక ప్రదర్శన

చిక్కడపల్లి, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): కమలాకర చారిటబుల్ ట్రస్ట్, కమలాకర లలిత కళాభారతిల సంయుక్తాధ్వర్యంలో సోమవారం రాత్రి త్యాగరాయగానసభలో మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రీల జయంతిని పురస్కరించుకుని ప్రదర్శించిన జైకిసాన్ రూపక ప్రదర్శన ప్రేక్షకరంజకంగా సాగింది. కళాకారులు పాత్రోచితంగా నటించి ప్రదర్శనను రక్తికట్టించారు. అనంతరం జరిగిన సమావేశంలో నిట్టల గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై కళాకారులను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖులు బి.జయరాములు, శ్రీధర్, లక్ష్మణాచార్యులు, వీవీ రాజు, ఎస్. మాధవి, వెంకటేశ్వరరావు, భారతీకమలాకర్ పాల్గొన్నారు.

10న శ్రీనివాస్‌యాదవ్‌కు సాలూరి పురస్కారం ప్రదానం

చిక్కడపల్లి : ఆధ్యాత్మిక గాయకుడు శ్రీనివాస్ యాదవ్‌కు ప్రముఖ సినీ సంగీత దర్శకుడు సాలూరి రాజేశ్వరరావు పురస్కారాన్ని ఈనెల 10న త్యాగరాయగానసభలో బహూకరిస్తున్నట్లు రసమయి సంస్థ అధ్యక్షుడు డా. ఎం కె రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి చంద్రకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని పురస్కారాన్ని బహూకరిస్తారన్నారు. సాలూరి రాజేశ్వరరావు 103వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

దరఖాస్తు రుసుంలో 50శాతం రాయితీ ఇవ్వాలి

రాంనగర్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2025-27 సంవత్సరాలకు గానూ మద్యం దుకాణాల ఏర్పాటులో రిజర్వేషన్ ప్రకటించిన మద్యం దుకాణాల దరఖాస్తు రుసుంలో 50 శాతం రాయితీ ఇవ్వాలని ఎక్సైజ్‌శాఖ కమిషనర్‌కు ఆలిండియా హ్యూమన్ రైట్స్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు సిరిగిరి శ్యాం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన రాంనగర్‌లోని తన కార్యాలయంలో సోమవారం మాట్లాడారు. మద్యం దుకాణాల్లో గౌడ కులస్థులకు 15శాతం, ఎస్సీలకు 10శాతం, ఎస్టీలకు 5శాతం రిజర్వేషన్లు ఖరారు చేశారని అన్నారు. అయితే దరఖాస్తు రుసుం అందరికీ ఒకే ధర పెట్టడం వల్ల రిజర్వేషన్‌లో దరఖాస్తు చేసుకునే వారు ఆ ఆర్థిక భారం తట్టుకోలేకపోతున్నారన్నారు. రాయితీ కల్పిస్తే రిజర్వేషన్ వర్గాల వారికి ఆర్థికభారం తగ్గుతుందన్నారు.

గురువు నారాయణకు నివాళులర్పించిన మంత్రి శ్రీహరి



వి.నారాయణ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మంత్రి వాకాటి శ్రీహరి తదితరులు

రాంనగర్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : తనకు విద్యను నేర్పిన గురువు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వి.నారాయణకు రాష్ట్ర పశుసంవర్ధక, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకాటి శ్రీహరి నివాళులర్పించారు. మక్తల్ నియోజకవర్గానికి చెందిన వి.నారాయణ(91) మంత్రి వాకాటి శ్రీహరికి చిన్ననాటి గురువు. ఆయన కొంత కాలంగా రాంనగర్‌లో నివాసం ఉంటూ ఆదివారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి ఆయన నివాసానికి వచ్చి నారాయణ భౌతికకాయానికి నివాళులర్పించారు. నారాయణ అంత్యక్రియలు అంబర్‌పేటలోని హర్రాజీపెంట హిందూ శ్మశానవాటికలో జరిగాయి. కార్యక్రమంలో విశ్రాంత ఐజీ ఆకుల నర్సింహ, ప్రముఖ న్యాయవాది కె.సత్యనారాయణ, మద్దెలవీడు గ్రామ మాజీ సర్పంచి కొత్త వెంకటప్ప, బాలకృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, సుదర్శన్, ఆంజనేయులు, సూర్య నారాయణ భౌతికకాయానికి నివాళులర్పించారు.

సామాజిక సేవలో బీఆర్ఎస్ నాయకులు ముందుండాలి

● ఎమ్మెల్యే ముఠా గోపాల్



తలసాని జన్మదిన కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆర్.వివేక్ తదితరులు

రాంనగర్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : సామాజిక సేవా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు అందరికంటే ముందు వరుసలో ఉండాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్యపార్కు వద్ద బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆర్.వివేక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుట్టినరోజు వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్‌చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నగర సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, పార్టీ యువజన నాయకుడు ముఠా జైసింహ, రాంనగర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.శంకర్ ముదిరాజ్, మన్నె దామోదర్‌రెడ్డి, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు రజనీకాంత్‌గౌడ్, నర్సింగ్‌రావు, సయ్యద్ అస్లాం, కిషన్‌రావు, బబ్లూ, కూరగాయల శ్రీనివాస్, రాజు, హరినాథ్, బాబు పాల్గొన్నారు.

తలసానికి ముషీరాబాద్ నేతల సన్మానం

ముషీరాబాద్ : ముషీరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ ఆధ్వర్యంలో సోమవారం మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేసి సన్మానించారు. అనంతరం ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షులు వై. శ్రీనివాస్‌రావు, రాకేష్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సు చార్జీల పెంపు దుర్మార్గం : ఆప్



మాట్లాడుతున్న ఆప్ నేతలు బుర్ర రాముగౌడ్, విజయ్ మల్లంగి, ఎం.ఏ.మాజీద్

కవాడిగూడ, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో ఆర్టీసీ బస్సు చార్జీల పెంపు దుర్మార్గం అని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు బుర్ర రాముగౌడ్, విజయ్ మల్లంగి, ఎం.ఏ.మాజీద్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలల క్రితమే విద్యార్థుల బస్సు పాసులు 30శాతం నుంచి 50శాతం పెంచిన ప్రభుత్వం తిరిగి ప్రస్తుతం నగర ప్రజలపై మరోసారి బస్సు చార్జీలు పెంచి పేద, మధ్యతరగతి కుటుంబాల సంపదను దోచుకుంటుందని మండిపడ్డారు. సోమవారం లిబర్టీలోని ఆప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 50శాతం బస్సు చార్జీలను పెంచడం అంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల సంక్షేమం పట్ల ఎటువంటి చిత్తశుద్ధి లేదని స్పష్టమవుతుందని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలకు సామాన్య ప్రజలను ఇన్ని ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రభుత్వానికి జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలు రాబోయే ఉప ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్తారని వారు హెచ్చరించారు. పెంచిన బస్ చార్జీలకు నిరసనగా ఈనెల 8న బస్‌భవన్ వద్ద ఆప్ నిరసన కార్యక్రమం చేపడుతుందని వారన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



మాట్లాడుతున్న తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ

బర్కత్‌పుర, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు 8,500 కోట్ల రూపాయలను విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం తెలంగాణ అధ్యక్షుడు వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 12లక్షల 75వేల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. సోమవారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూసీ సుందరీకరణకు నిధులు ఎక్కడివో రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మూసీ సుందరీకరణ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలపై ఉన్న శ్రద్ధ విద్యార్థులపై లేదని ఆయన ఆరోపించారు. కళాశాల యాజమాన్యాలు కూడా నిరవధిక సమ్మెకు పిలుపునిస్తున్నాయని దీనికి రాష్ట్ర ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు రాజేష్, ప్రవీణ్‌కుమార్, జగదీష్, దయాకర్, బాలు, అర్జున్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష పదవికి పోటాపోటీ

● పార్టీ అగ్రనాయకులకు ఆశావాదుల విన్నపాలు



దీన్‌దయాల్ రెడ్డి



సదానంద్

ముషీరాబాద్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి పదవి కాలం ముగియడంతో డివిజన్ అధ్యక్ష పదవి కోసం పార్టీ సీనియర్ నాయకులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ అగ్రనాయకులను, స్థానిక ఎమ్మెల్యేను కలుస్తూ తమకే అధ్యక్ష పదవి ఇవ్వాలని విన్నపాలు చేస్తున్నారు. డివిజన్ అధ్యక్ష పదవి ఆశిస్తున్న ముషీరాబాద్ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సదానంద్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఎడ్ల హరిబాబుయాదవును కలిసి అధ్యక్షపదవి తనకే ఇప్పించాలని కోరారు. డివిజన్‌లోని కొంత మంది పార్టీ ముఖ్యనాయకులు సైతం సదానంద్‌కు మద్దతుగా హరిబాబును కలిసి విన్నపాలు చేశారు. డివిజన్‌లో ఇప్పటివరకు బీసీ, మైనార్టీ, రెడ్డి వర్గాలకు డివిజన్ అధ్యక్ష పదవి అప్పగించారు. ఒక్కసారి ఎస్సీలకు అధ్యక్ష పదవి అప్పగించాలని పార్టీ నాయకులు కోరుతున్నారు. పార్టీ సీనియర్ నాయకుడు దీన్‌దయాల్‌రెడ్డి అధ్యక్ష పదవి కోసం బహిరంగంగా ప్రయత్నాలు చేయనప్పటికీ అధిష్ఠానం తనకు ఇస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానని డివిజన్ నాయకుల వద్ద పేర్కొంటున్నారు. ఆయన ఎమ్మెల్యే ముఠాగోపాల్ తనయుడు ముఠా జైసింహకు అత్యంత సన్నిహితుడు కావడంపై డివిజన్‌లో అధ్యక్ష పదవి విషయం ఎవరికి దక్కుతుందా అని చర్చనీయాంశంగా మారింది. త్వరలో జరగనున్న జీహెచ్ఎంసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని స్థానిక ఎమ్మెల్యే అధ్యక్ష పదవి నియామకంలో నిర్ణయం తీసుకుంటారని పలువురు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహల మద్దతు ఎవరికి ఉంటే వారే అధ్యక్ష పదవి బాధ్యతలు చేపడుతారని డివిజన్‌లో జోరుగా ప్రచారం జరుగుతున్నది. నియోజకవర్గంలోని ఆరు డివిజన్లకు నూతన అధ్యక్షులను నియమించాల్సి ఉన్నప్పటికీ పార్టీ అధిష్ఠానం ఆదేశాలు, నగరంలోని 24 నియోజకవర్గాలలో డివిజన్ నూతన అధ్యక్షులను నియమించకపోవడంపై ముషీరాబాద్ బీఆర్ఎస్ నేతలు అధ్యక్ష పదవికోసం ఆసక్తితో ఎదురుచూస్తున్నారు.



ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ముగ్గురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2025ను ప్రదానం చేశారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కె.శ్రావణి, మహ్మద్ ముబాసిర్ మోహినొద్దీన్, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తికి ఈ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేశారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణముదిరాజ్, కోఆర్డినేటర్లు జి. వేణుగోపాల్, సూర్య, ఫాతిమా, కరీమా, కుషికుమారి, రబియా అంజుమ్ పాల్గొన్నారు. - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

దాడికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

నల్లకుంట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి పాల్పడిన వ్యక్తిని దేశద్రోహిగా ప్రకటించి కఠిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆఫ్ తెలంగాణ మాలల జేఏసీ ఉపాధ్యక్షుడు ఎన్.ఇ.మహేందర్ డిమాండ్ చేశారు. జస్టిస్ బీ.ఆర్.గవాయిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం హైదర్‌గూడలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మానికి సంబంధించిన వ్యక్తులు న్యాయ వ్యవస్థపై దాడిచేయడం సమంజసం కాదన్నారు. ఈ దాడికి పాల్పడిన న్యాయవాది రాకేష్‌కిషోర్ వెనుక ఉన్న సంస్థలు, వ్యక్తులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టులోనే చీఫ్ జస్టిస్ బీ.ఆర్.గవాయిపై దాడి న్యాయ వ్యవస్థపై బ్లాక్‌డేగా ఈ రోజు నిలిచిపోతుందన్నారు.

జూబ్లీహిల్స్ టికెట్ అంజన్‌కుమార్‌కు కేటాయించాలి : ముసీరాబాద్ నేతలు

రాంనగర్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ టికెట్ మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్‌కు కేటాయించాలని ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన సికింద్రాబాద్ జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లింగాల శ్రీకాంత్‌గౌడ్, కార్యదర్శి మీసాల జయకుమార్‌లు సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌లను కోరారు. సోమవారం రాంనగర్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో అంజన్‌కుమార్‌యాదవ్ నగరంలో పార్టీకి అండగా నిలిచారని అన్నారు. సికింద్రాబాద్ ఎంపీగా నగర ప్రజలకు ఎంతో సేవలు చేశారని అన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఉన్న అంజన్‌కుమార్‌యాదవ్‌కు ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని వారు కోరారు.





రాంనగర్‌లో, గంగపుత్రకాలనీలో అమ్మవారిని నిమజ్జనం కోసం తరలిస్తున్న దృశ్యం

ఘనంగా అమ్మవారి నిమజ్జనం

రాంనగర్, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ నియోజకవర్గంలో దేవీనవరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన దేవీ నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులు అమ్మవారిని ఘనంగా ఊరేగించి నిమజ్జనానికి హుస్సేన్‌సాగర్‌కు తరలించారు. రాంనగర్‌లోని చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి ఊరేగింపు ఘనంగా జరిగింది. అసోసియేషన్ ప్రతినిధులు ఎం.నాగేష్‌ముదిరాజ్, విన్ను ముదిరాజ్‌తో పాటు సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని నిమజ్జనం చేశారు. గంగపుత్ర కాలనీలో ఓంగంగాభవానీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వాహకులు గోడబోయిన గోవింద్‌తో పాటు సభ్యులు అమ్మవారిని నిమజ్జనానికి తరలించారు. నిమజ్జన ఊరేగింపులో కళాకారుల నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

ఓ యువకుడిపై పలువురి దాడి

అంబర్‌పేట, అక్టోబరు 6(ఆంధ్రజ్యోతి) : దుర్గామాత నిమజ్జన వేడుకలు పూర్తిచేసుకుని ఇంటికి వస్తున్న ఓ యువకుడిపై కొందరు అకారణంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన అంబర్‌పేట పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ మేడిపల్లిలో నివాసం ఉంటున్న నరేష్ కుమారుడు అభినవ్(20) బాగ్‌అంబర్‌పేట అయ్యప్ప ఆలయం సమీపంలోని తన అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. ఈనెల 5వ తేదీ రాత్రి 10గంటల సమయంలో నిమజ్జనం పూర్తి చేసుకుని తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో అయ్యప్ప ఆలయం డీడీ కాలనీ వద్ద మల్లికార్జున్‌నగర్‌కు చెందిన గౌతమ్ అతని స్నేహితుడు సంపత్‌లు అభినవ్‌తో గొడవ పెట్టుకున్నారు. ఈ క్రమంలో వారు తమ మరికొంత మంది స్నేహితులతో కలిసి అభినవ్ పై బీర్ సీసా రాడ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో అభినవ్ ఎడమ కన్ను వద్ద తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అభినవ్ తండ్రి నరేష్ ఫిర్యాదు మేరకు అంబర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.